# ఈ ప్రశ్నకు జవాబేది?

## కె. మాధవి

టిక్ టిక్ మనే చప్పుడుతో కాల చక్రం నిశిరాత్రి నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ముందుకు పోతోంది. గదిలోపల కాలు కాలిన పిల్లిలాగా తిరుగుతూనే వున్నాడు చంద్రమౌళి. ఆలోచనలు ఆవిరై నుదుటి మీద స్వేదబిందువులుగా మారుతున్నాయ్. తనంతట తానుగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసిన అవసరం మరోసారి ఎదురయింది. ఒకసారి తప్పుకుని పారిపోయి నాన్న ఆలోచనల వరదాలో దాక్కున్నాడు. మళ్ళీ అదేపని చెయ్యాలా? అప్పుడు ఇంతగా ఆలోచించలేదు కాని ఇప్పుడు అలా చెయ్యటానికి వ్యక్తిత్వం ఎదురు తిరుగుతోంది సంస్కారం మందలిస్తోంది అలాగని తెగించి నిర్ణయం తీసుకోవటానికి ధైర్యం చాలటంలేదు. తండ్రి పట్టుదల తనకి బాగా తెలుసు ఆయన ఒకసారి మాట అంటే దానికి తిరుగు లేదు. శిలా శాసనమే తను పుట్టి బుద్ధెరిగిన తరువాత ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా జరిగిన సంఘటన తనెరగడు. బహుశా ఆయన జీవితంలోనే లేదేమో!

తన విషయాన్నే తీసుకుంటే తను ఏం తినవలసిందీ, ఎప్పుడు తినవలసిందీ దగ్గర నుండి ఎప్పుడు పడుకుని ఎప్పుడు లేవాలి అనేదాని వరకు ఆయన ఆజ్ఞ ప్రకారమే జరిగింది. ఇప్పుడయినా ఇక్కడ వుంటే అంతే. ఎప్పుడయినా దేనికయినా తను అభ్యంతరం చెప్పబోతే నీకు తెలియదు నువ్వూరుకో అనేవాడు. అంతే! తన మనసులోని మాట గొంతు మొదట్లోనే ఆగిపోయేది. తెలిసిన వాళ్ళు 'నాన్నకూచి' అని ఎగతాళి చేసినప్పుడు ఎక్కడలేని రోషం వచ్చేది. అది తండ్రి ఎదుట పడనంత వరకే.

ఆయన ఇష్టప్రకారమే ఇంజనీరయ్యాడు చివరకు ఆయన ఇష్టప్రకారమే తను ఇష్టపడిన రాధికకు కాకుండా వందన మెడలో మూడుముళ్ళు వేశాడు. అప్పట్లోనే తన ఇష్టాఇష్టాలని పూర్తిగా మర్చిపోయాడు. అప్పుడు ఇష్టం నోరు మూసుకున్నా ఇప్పుడు బాధ్యత కళ్ళు తెరిచింది. తను అప్పుడు తండ్రి చాటు బిడ్డ ఇప్పుడు ఒక బిడ్డ తండ్రి.

తిరిగి తిరిగి అలసిపోయి మంచం మీద కూలబడ్డాడు మౌళి ఒక్కసారిగా తనలో చెలరేగిన సంఘర్షణకి తట్టుకోలేక పోతున్నాడు. మనసు కర్తవ్యాన్ని ప్రబోధిస్తున్నా పుట్టినప్పటినుండీ రాజ్యం చేస్తున్న అజ్ఞాత శక్తి వెనక్కి లాగుతోంది! అలసటగా వెనక్కివాలి

కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకున్నాడు. మూసిన కళ్ళముందు వందన రూపం కదిల్చింది. ఆమెతో పంచుకున్న రెండు సంవత్సరాల జీవితం స్మృతి పథంలో మెదిలింది దాని ఫలితమైన బాబు భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా నిలిచింది.

చీకటి శత్రువుల్ని తరిమేసి బాల భానుడు గగన సింహాసనాన్ని అధిరోహించాడు. అది చూసి సబ్దుగా నిద్రిస్తున్న లోకం ఉత్సాహంగా లేచి ఆశగా చైతన్యం లోకి అడుగు లేస్తోంది. మౌళి కూడా తల విదిలించి పైకి లేచాడు.

"నాన్నా! రేపటితో శలవు అయిపోతుంది" తన పను లు ముగించుకున్న తరువాత మెల్లగా తండ్రితో చెప్పాడు మౌళి రాజారావు కూడా ఎక్కడికో బయలుదేరుతున్నాడు.

"అయితే రేపు బయలుదేరి వెళ్లు."

" .. .. "

"ఏమిటి?" బయటకి వెళ్ళబోతూ ఆగి, ఇంకా అక్కడే నిలబడిన కొడుకుని అడిగాడు.

"ఈ రోజు వందన దగ్గరకి వెళ్తున్నాను". అన్నాడే కాని తరువాత తనే ఆశ్చర్యపోయాడు మౌళి ఎలా అనగలిగానా అని.

"ఏమిటి?" నెత్తిమీద పిడుగుపడ్డట్లు అదిరిపోయాడు రాజారావు అనుమానంగా ఒకసారి మౌళిని ఎగాదిగా చూశాడు. "మతివుండే మాట్లాడుతున్నావా? నేను చెప్పిందేమిటి? ఆలోచించే ఆ మాటంటున్నావా!"

"బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. నేనా పని చెయ్యలేను. అది న్యాయం కాదు"

రాజారావు ఉగ్రుడైపోయాడు. కళ్ళల్లో ఎర్రజీరలు తొంగిచూస్తున్నాయ్. "నోర్మూయ్. గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందని, న్యాయాన్యాయాల్ని గురించి నువ్వు నాకు చెప్తున్నావా? వాళ్లు చేసింది న్యాయమా?"

"వాళ్ళు చేశారని మనం కూడా అలాగే చేస్తే వాళ్ళకి మనకి తేడా ఏమిటి?"

"తేడా ఎందుకుండాలి? దెబ్బకిదెబ్బ. చేసిన దానికి అనుభవిస్తారు."

"ఎవరు?"

"ఇంకెవరు? చేసిన వాళ్ళే!"

"వందన ఏం చేసింది? బాబేం చేశాడు?"

నిర్ఘాంతపోయాడు రాజారావు. తను అపురూపంగా తీర్చిదిద్దుకున్న కొడుకు తననే ఎదురు ప్రశ్నిస్తున్నాడా? కలలో కూడా అనుకోలేదు. ఇలాంటి పరిస్థితి వస్తుందని. "ఇందులో వందన పాత్ర లేదంటావా? తన తండ్రి చేసిన వెధవ పని ఆమెకి తెలియకుండానేఉంటుందా?"

"వందన అలాంటిది కాదు నాన్నా! తనకి విషయం తెలిసివుండదు. తెలిస్తే ఇలా జరగనిచ్చేది కాదు".

"కాకపోతే తనకి పెళ్లెలా అవుతుంది? ఏంపెట్టి చేస్తాడు? పరువు మర్యాద కల వాళ్ళనుకున్నాను. ఊరుచుట్టూ అప్పులనీ, మేడిపండు ఆడంబరాలని నాకేంతెలుసు? పొలం కట్నంగా ఇస్తానని చెప్పి ఆ పొలాన్ని అమ్ముతూ అడ్వాన్సుగా తెచ్చిన డబ్బుతో పెళ్ళిచేస్తాడా? వంటడబ్బడిగితే ఇదిగో అదిగో అంటాడా? ఆ వెంకట్రా

మయ్యా చెప్పబట్టి సరిపోయింది హమ్మ!
ఎంత వంచన! నన్నే మోసంచేస్తాదా ?
చూపిస్తాన ఈ రాజారావు అంటే



ఏమిటో!" ఉద్రేకంతో ఊగిపోతున్నాడు రాజారావు.

'మీ రెన్నయినా చెప్పండి. పండగకి

ఈ విషయం తెలిసుండదని నా నమ్మకం."

'కావచ్చు కాని ఈ విషయం ముందే తెలిస్తే నీపెళ్ళి నందనతో జరిగేదా? ఇప్పుడూ అదే అనుకుందాం"

"అది వేరు నాన్నా! మనం కాదనకుంటే మాత్రం జరిగేది కాకుండా

పోతుందా?"

"అదేనేననేదీను. జరిగిన అవమానం మర్చిపోతామా? అంతకి అంత ప్రతీకారం తీర్చుకుంటాను." పళ్ళు బిగువున అన్నాడు రాజారావు.

"అందుకు ఇదేమార్గమా?

"అవును. ఇదే సరైన మార్గం. ఏది ఎలా చెయ్యాలో ఎవరిని ఎలా సాధించాలో నాకు తెలుసు."

"నాన్నా! ఒక్కసారి వందనగురించి ఆలోచించండి మా కోడలు బంగారు బొమ్మ అని మురిసిపోయారే! లక్ష్మీదేవే ఇంట్లో అడుగు పెట్టిందని గొప్పగా చెప్పున్నారే! అదంతా ఏమయింది? ఆమె తండ్రి మనల్ని మోసం చేశాడని మీ కోడలికి అన్యాయం చేస్తారా? ఒకరు తప్పుచేస్తే శిక్ష మరొకరికా?"

రాజారావు వెంటనే ఏమీ మాట్లాడలేదు. మౌళి ఆశగా ఆయన్నే చూస్తున్నాడు. "చూడు మౌళి నిప్పు పట్టుకున్న చేతినే కాల్చుతుంది. కాని తప్పు! తనకు సంబంధించిన వాళ్ళందరినీ శపిస్తుంది" రాజారావు కంఠం మళ్ళీ కఠినంగా మారిపోయింది. "కోర్టుకెళ్తాడటగా! చూస్తాను. ఏకోర్టుద్వారా కూతురుతో కాపురం చేయిస్తాడో! మోసంతో పెళ్ళిచెయ్యడం అనుకున్నాడేమో కోర్టుకెక్కి సంసారం సరిబెట్టటం అంటే"

"వాళ్ళు తొందరపడ్డారని మనమూ తొందరపడితే ఎలా? పోయింది ఎలాగూ పోయింది. ఇంక వాళ్ళదగ్గర ఏమీ లేదని కూడా తెలుసు. మనం ఏం చేసినా లాభంలేదు. తెగతెంపులు కావటం తప్పితే. వాళ్లుఇస్తేకాని బ్రతకలేని స్థితిలో మనం లేము. అలాంటప్పుడు ఎందుకీ పట్టుదలలు? వాళ్ళకి లేకపోయినా మన కుండాలికదా!" నచ్చచెప్పబోయాడు మౌళి. కాని అవేమీ రాజారావు చెవికి ఎక్కలేదు.

"అలాగని వాళ్లు చేసినదానికి నోరు మూసుకుని పడివుండమంటావా? ఈ సంగతి తెలిస్తే పదిమందిలో ఎంత అప్రదిష్ట! అయినా ఇదంతా నాకోసమా? నేనేమయినా పట్టుకుపోతానా? ఏం చేసినా నీ బాగుకోసమే."

"అవును అదంతవరకు నాకు మేలయినా కన్నతండ్రిగా మీరు మనస్ఫూర్తిగా నాక్షేమం కోరే చేస్తారు. కాని నా బిడ్డ మాటేమిటి? మన పంతాల మధ్య వాడేమవుతాడు? మీరు నాకోసం ప్రాకులాడినట్టే తండ్రిగా నాబిడ్డ భవిష్యత్తు గురించి ఆలోచించవలసిన బాధ్యత నాకు లేదా?"

"ఎందుకులేదు. వాడు ఎప్పటికయినా యిక్కడికి రావలసినవాడే. నీకాభయం అక్కర్లేదు."

"అంటే? నాస్వార్థం కోసం బాబుకి తల్లి బ్రతికుండగానే లేకుండాచెయ్యనా! బిడ్డ నుంచి తల్లిని వేరు చెయ్యనా?"

"మధ్య నువ్వెందుకు బాధ పడతావు? అంత కావాలంటే తనే వస్తుంది."

"ఎలా వస్తుంది? మీరు పెట్టిన ఆంక్ష ప్రకారం ఇస్తానన్న కట్నం తీసుకుని మరీ రావాలి. అది జరిగే పనేనా? ఆ అవకాశమే వుంటే ఇప్పుడిలా జరిగేదే కాదు కదా!"

"ఆ జ్ఞానం వాళ్ళకుండాలి"

"అది వాళ్ళకు లేదు మరి."

"దానికి నేనేం చెయ్యను?"

"మానవత్వంతో ఆలోచించండి. వందన ఈ ఇంటికోడలు, మన మనిషి. ఆమె మంచిచెడ్డలు, కష్టసుఖాలు మనవి. పెళ్ళిలో పెద్దవాళ్ళు కట్నం విషయంలో మనల్ని మోసం చేశారని, ఇప్పుడు వందనని వదిలెయ్య మంటారా? అలా చెయ్యటం న్యాయమా?"

"అదంతా నాకనవసరం, వాళ్ళకి, మనకి ఇంక ఎలాంటి సంబంధం వుండటానికి వీల్లేదు."

"అలాగే, మీరన్నట్లు వాళ్ళతో మనకి సంబంధం వద్దు, దానికి ఇష్టపడితేనే వందనని తీసుకొస్తాను."

"అలా కుదరదు, వాళ్ళమ్మాయి వాళ్ళింట్లోనే వుండాలి. చేసిన పనికి క్షణ క్షణం కుళ్ళి చావాలి. లేక పోతే చేసిన వెధవపని చాలక ఎదురు తిరుగుతాడా? నీకు చేతనయింది చేసుకోమని సవాల్ చేస్తాడా? అదే చేసి చూపిస్తాను. ఆడపిల్లనిచ్చినవాడికే అంత నిక్కుంటే నేనేం తీసిపోయానా?"

"నాన్నా! మీకు పుణ్యం వుంటుంది. మీమీ పట్టుదలల మధ్య మమ్మల్ని పావులుగా చెయ్యొద్దు. మీరు చెప్పినట్లు వందనని వదిలెయ్యలేను, ఈరోజే వెళ్ళి తీసుకొస్తాను. ఇప్పటికే చాలా ఆలస్యం చేశాను." మనసులో మాట ఖచ్చితంగా చెప్పేసి వెనక్కి తిరిగాడు మౌళి.


"మౌళీ!" అది పిలుపుకాదు. పిడుగుపాటు! సింహగర్జన! తుపాకి శబ్దం విన్న లేడిలా పారిపోతున్న ధైర్యాన్ని వెనక్కి తెచ్చుకుంటున్నాడు మౌళి. ఏమయినా సరే తన నిర్ణయం మాత్రం మార్చుకో కూడదనే నిశ్చయించుకున్నాడు.

"ఊఁ." ఇంతకాలానికి నన్నే ఎదిరించేటంతటి మగాడివయ్యావన్నమాట! ఫర్వాలేదే! నిన్నగాక మొన్న వచ్చిందో లేదో పెళ్ళాం అంత కావలసిందయి పోయిందా? ఇన్నేళ్ళు పెంచి, ఇంతా చేసిన మామాట లెక్కలేదు. మే మేమయినా ఫర్వాలేదు. మా పరువు, మర్యాద ఏ గంగలో కలిసిపోయినా నీకుమాత్రం నీ పెళ్ళామే కావాలి. ఇంత అవమానం జరిగిన తరువాత ఇంకా కావాలని ప్రాకులాడటానికి నీకు సిగ్గుగా లేదూ? రోషం, అభిమానం వున్న మనిషివి కావు?'' రెచ్చిపోతున్నాడు రాజారావు. కళ్లు నిప్పులు కురిపిస్తున్నాయ్.

"అర్థంలేనిఅభిమానం, అనర్థదాయకమైన రోషం కాదునాన్నా. మనిషికి ఉండవలసింది. ఆలోచన. విచక్షణ. ఇప్పుడు మాత్రం? ఫలానా వాళ్ళు కోడల్ని వదిలేశారు అని అందరూ అనుకుంటుంటే అది మనకి గౌరవంగా వుంటుందా? అయినా ఇందులో నేను సిగ్గుపడవలసిందేమీ లేదు".

"నీ కెందుకుంటుంది ? బాగా పెళ్ళాం మాయలో పడిపోయావు. ఇంక నా మాటలెలా రుచిస్తాయ్? అడ్డాల నాడు బిడ్డలు కాని గడ్డాలొచ్చాక బిడ్డలా?"

"తమ పిల్ల లయినంత మాత్రాన వాళ్ళకి ఎంత పెరిగినా వ్యక్తిత్వం ఉండకూడదని మీరనుకోకుండా వుంటే అప్పటికీ ఇప్పటికీ ఏ తేడా వుండదు. అన్ని విషయాల్లోనూ మీ మాటే నెగ్గాలంటే అది అన్ని వేళలా సాగదు. ఒక స్థితికి వచ్చినతరువాత మాకూ స్వంత ఆలోచన



లనేవి వుంటాయ్. వాటికీ మంచి, చెడు వుంటుంది. అది మీ రర్థం చేసుకోకపోతే ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు. మీరు నన్నే మయినా అనండి. ఈ విషయంలో మాత్రం నా నిర్ణయం మారదు. ఇంతకాలం మీరు ఏం చెప్పినా విన్నాను, అలాగే చేశాను ఇప్పుడు మాత్రం అలా చెయ్యలేను." నిదానంగానే అయినా స్థిరంగా అన్నాడు మౌళి.

"అయితే నా నిర్ణయం కూడా విని నువ్వు చెయ్యదలచుకున్నది చెయ్యి నా మాట కాదని నువ్వు నీ పెళ్ళాన్నే కనక తెచ్చుకుంటే నా శవాన్నే కళ్ళచూస్తావు నాకు కొరివిపెట్టే అర్హతకూడా నీకుం డదు." తనకంటే స్థిరంగా చెప్తున్న తండ్రిని చూసి షాక్ తిన్నాడు మౌళి. మనసులో ఎక్కడో భయం మొదల యింది.

రాజారావే మళ్ళీ అన్నాడు "మౌళి! నిన్ను చూసి నేనెంతో గర్వపడుతుం టాను. నేనంటే నీకు ఎనలేనిగౌరవమని, నా మాట జవదాటవని నాకో నమ్మ కం. ఇప్పటివరకు అలాగే జరిగింది. ఇప్పుడు నువ్వు తిరస్కరిస్తున్నది నన్ను కాదు నీమీద నాకున్న నమ్మకాన్ని. నువ్విలా మాట్లాడుతావనీ, మారిపోతావని నేను కలలోకూడా అనుకోలేదు. నువ్వు చేస్తున్న పనికి వాళ్ళు చేసినదానికంటే ఎక్కువ బాధగావుంది నాకు ఇంక వాళ్ళదగ్గర నాకేం విలువ వుంటుంది? పట్టుదలకీ, పౌరుషానికీ పెట్టింది పేరు మన వంశం. ఏ తండ్రికయినా ఇంత కంటే అపమానం ఇంకేం కావాలి? ఆలో చించుకుని నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి కాని నా సంగతి నీకు తెలియదు. తెలిస్తే నువ్విలా ప్రవర్తించవు. నేను మాటంటే మాటే," ఆపలేని ఆవేశంలో అన్నాడు.

"నేనూ మీ కొడుకునే నాన్నా! నేనూ మాటంటేమాటే అగ్నిసాక్షిగా ప్రమాణం చేసి ఇప్పుడు తుడిచేసుకోలేను." మౌళి కూడా పట్టుదలగానే అన్నాడు. అంత కంతకు అతని ఆవేశం అధికమవు

తోంది. ఏమిటీ ఈ ఆంక్షలు! తను పట్టిన కుందేలుకి మూడేకాళ్ళు అనేవాళ్ళ మాట ఎంతవరకు వినాలి? ఎదటి వాళ్ళ ఇష్టాఇష్టాల, కష్టసుఖాలతో సంబంధం లేకుండా ఎంతవరకు తమ మాటే నెగ్గి తీరాలి అని పట్టుపట్టే వాళ్ళని ఏవిధంగా గౌరవించాలి? తను చేస్తున్న దాంట్లో తప్పేమిటి? ఇందులో ఆయన్ని అవమానించేదేముంది? కానప్పుడు తనెందుకు భయపడాలి? ఒక్కసారి తండ్రి బెదిరింపు జ్ఞాపకం వచ్చింది. కాని అతని ఆవేశం దానికంత ప్రాముఖ్యం ఇవ్వలేదు.

"బాబూ! నామాట వినరా. మీ నాన్నగారి సంగతి నీకు తెలియదు. అన్నంతపనీ చేసే మనిషి. ఆయనతో పంతం పెట్టుకోకు. కొంతకాలం పోతే ఆయనే సర్దుకుంటారు." అంతా విన్న తల్లి కంట తడిపెట్టుకుంది.

"అలాగనే ఇంతకాలం పూరుకున్నానమ్మా. బాబుపుట్టి అప్పుడే ఎనిమిది నెలలయింది. చూడటానికి కూడా నన్ను వెళ్ళనివ్వలేదు. నాబాధ మీకెలా తెలుస్తుంది? అయినా అయినదానిలోను కాని దానిలోను ఆయనకా పంతం ఏమిటి? ఆయన సాధించేది ఎవరిని? ప్రత్యక్షంగా వందననీ, పరోక్షంగా నన్నూ. అది అర్థం చేసుకోరే?"

"ఏమిటో నాయనా! ఎప్పుడూ లేనిది నీకింత మొండితనం ఎలా వచ్చిందో! అసలు ఈ ఇంటికే ఏదో శని పట్టింది." సావిత్రమ్మ చేత్తో నదుటిమీద కొట్టుకుంది.

ం ం ం

"వందనా!" ఇంటికప్పుకేసి చూస్తూ పడుకున్న వందన మౌళి పిలుపు విని లేచి కూర్చుంది. కలా నిజమా అన్నట్లు అపనమ్మకంగా చూస్తున్న ఆకళ్ళల్లో ఏదో మెరుపు! కళ తరిగిన ముఖంలో ఒక్కసారిగా కోటికాంతులు తళుక్కుమన్నాయి. అదిచూసిన మౌళి తను అనుభవించిన సంఘర్షణ అంతా మరచిపోయాడు.

"మీరు .... మీరువచ్చారా ?" ప్రత్యక్షంగా చూస్తున్నాకూడా వందనకి నమ్మకం కలగటం లేదు.

"రానను కున్నావా ?" వెళ్ళి భార్య ప్రక్కన కూర్చున్నాడు మౌళి.

"మొదట్లో నమ్మకం, ఆ తరువాత కొంతకాలం ఆశవుండేవి. ఇప్పుడు రెండూ పోయినయ్. కనీసం బాబుని చూడాలనయినా అనిపించలేదా మీకు?" సూటిగా ప్రశ్నిస్తున్న వందన ముఖం చూడలేక తప్పుచేసినవాడిలా తల దించుకున్నాడు మౌళి.


"నాన్నగారి సంగతి నీకు తెలుసుకదా! ఆయనకి ఎదురుచెప్పే ధైర్యం లేక, కాదని ఆయన మనసు నొప్పించే ధైర్యం లేక రాలేదుకాని మానసికంగా నేనెంత మథన పడ్డానో నీకు తెలియదు, ఇంకా అలా వుండలేక, ఇప్పటికి ధైర్యం చేసి నాన్నగారు వద్దంటున్నా లెక్క చెయ్యకుండా వచ్చేశాను."

బాబుని తెచ్చి మౌళికి ఇచ్చింది.

కొడుకుని ఎత్తుకోగానే ఒళ్ళు పులకరించింది మౌళికి. "పేరేం పెట్టావు?" బాబు ముఖంలో తన పోలికల్ని వెదుక్కుంటూ వందన నుద్దేశించి అడిగాడు.

"మీకూ బాధ్యత వుందన్నదానికి గుర్తుగా అది మీకే వదిలేసాను"

"నా బాధ్యతల్ని విస్మరించే మనిషిని




కాదు నేను" ఆగి మళ్ళీ అన్నాడు. "వందనా! ఒక మాట అడుగుతాను. నిజం చెప్తావా?"

"మీరడగబోయేదేమిటో నాకు తెలుసు." చివ్వున తలెత్తింది వందన. గుంటలు పడిన కళ్ళు నిండుగా నీళ్ళు! "ప్రమాణం చేసి చెప్తున్నాను, మామయ్యగారు వచ్చి అడిగే వరకు నాన్న ఇలా చేశారని నాకు తెలియదు. అసలు ఇంత పెద్ద మొత్తంలో అప్పులున్నాయని కూడా నాకు తెలియదు. తెలిస్తే జీవితాంతం అవివాహితగా వుండి పోవటానికయినా ఒప్పుకునేదాన్ని కాని ఇలా మోసంతో వివాహం చేసుకునేదాన్ని కాదు"

"ఆ నమ్మకంతోనే వచ్చాను. బట్టలు సర్దుకో వెళ్దాం."

"ముందు కాళ్ళు కడుక్కోండి భోజనం వడ్డిస్తాను" వెళ్ళబోతున్న వందనని చెయ్యి పట్టి ఆపాడు మౌళి

"వద్దు వందనా! నేనిక్కడ మంచి నీళ్లు కూడా తాగదలచుకోలేను. మరో విషయం ఇక ముందు వీళ్ళకీ మనకీ ఎలాంటి సంబంధం వుండకూడదన్నారు నాన్నగారు."

సూట్‌కేస్ పట్టుకుని భర్త వెనక బయటకి వచ్చిన కూతుర్ని వింతగా చూసింది జగదాంబ.

"వెళ్తున్నానమ్మా"

"ఇదేం చోద్యమే! ఉన్నట్టుండి వెళ్తానంటావు? పిల్లాడ్ని ఎత్తుకుని ఇలా సరి నెల్లలో వెళ్ళకూడదు. మంచి, చెడు వుంటాయి అవన్నీ చూసుకోవద్దూ?"

"అవసరం లేదు. అసలు వెళ్తాననే అనుకోలేదు. అలాటిది వెళ్తున్నాను. అందుకు సంతోషించాలి."

జగదాంబ ధోరణి అల్లుడివైపు తిరిగింది. "అదేమిటయ్యా! ఇప్పుడే వచ్చి ఇప్పుడే వెళ్ళిపోతారా? భోజనం అయినా చెయ్యలేదు. అప్పుడేదో అవసరానికి అడ్డేసుకున్నారు. మీది మీకు ముట్ట చెప్పక పోతామా అని చెప్పలేదు. అవసరాలు, ఆపదలు అందరికీ వుంటాయ్. అదేమీ కడుపులో పెట్టుకోవద్దు. మా పిల్లకి మేమిచ్చుకోమా?"

"అమ్మా! ఇంక ఆ ఆలోచనలు మానెయ్." అని అడుగు ముందుకు వేసింది వందన. "పదండి".

చీకటి పడుతుండగా గుమ్మంలో

అడుగు పెట్టిన మౌళి, వందన శిలా ప్రతిమలే అయ్యారు. రాజారావు అన్నంత పనీ చేసి మరోవిధంగా తనమాట నెగ్గించుకున్నాడు. భర్త శవంమీద పడి ఏడుస్తున్న సావిత్రమ్మ దగ్గరకొచ్చిన కొడుకుని చూసి భద్రకాళే అయింది.

"దుర్మార్గుడా!" కన్న తండ్రిని పొట్టన పెట్టుకున్నావు కదరా! తండ్రి ప్రాణంకంటే నీకు పెళ్ళామే తీపయింది కదూ! ఇక నీఇష్టం వచ్చినట్లు ఊరేగు.

"అమ్మా?" బాణపుదెబ్బతిన్న పక్షిలా విలవిల్లాడాడు మౌళి.

"ఛీ!" నన్నలా పిలవకు. ఆయనతో పాటే నన్నూ చంపెయ్యి. అమ్మ అన్న అభిమానం, నాన్న అన్న గౌరవం వుంటే ఇలా చేసేవాడివా? చూడరా. ఒక్కసారి ఆయన ముఖం చూడు. ప్రాణాన్ని పణంగా పెట్టినా నువ్వు లెక్కచెయ్యలేదు. నీ పంతం నువ్వు నెగ్గించుకున్నావు. ఆయన పంతం ఆయన నెగ్గించుకున్నారు. మధ్య నలిగిపోయింది నేను."

"అత్తయ్యా! మీకాళ్లు పట్టుకుంటాను ఆయన్నేమీ అనకండి." వందన ఏడుస్తూ అత్తగారి కాళ్ళమీద పడింది. ఈ గందరగోళానికి బెదిరిపోయి ఏడుస్తున్న బాబుని ఎవరో ఎత్తుకుని దూరంగా తీసుకెళ్ళారు.

"రాక్షసి! ఎంత నంగనాచిలా మాట్లాడుతున్నావే! ఏమంటూ పాదం పెట్టావో పచ్చని సంసారంలో చిచ్చు పెట్టావు. నోట్లో నాలుకలేని నా బిడ్డని తండ్రిమీదకే పునిగొలిపావు. నీకాష్టం కూలిపోను, నా భర్తని మింగావు కదే. నా ఉసురు పోసుకుని నువ్వేం సుఖపడతావో చూస్తాను." పిచ్చిపట్టినట్లు అరుస్తోంది సావిత్రమ్మ. వందనని ఎవరో లోపలికి తీసుకెళ్ళారు.

ఎవరెవరో వస్తున్నారు. ఏమిటేమిటో అంటున్నారు. మౌళికి ఏమీ వినిపించడం లేదు. మెదడు మొద్దుబారిపోయింది. నిద్రలో నడుస్తున్నట్లుగా లేచి లోపలికి వెళ్ళాడు. వందన అతని చేతుల్లో వాలిపోయింది.

"దీనంతటికి నేనే కారణం. ఆయనకి అంత ఇష్టం లేనప్పుడు మీరెందుకిలా జేశారండి! నా ఖర్మని నన్ను వదిలేస్తే ఇదంతా జరిగేదికాదు. నామీద దయ చూపించి అనర్థాన్ని కొనితెచ్చారు. అనవసరంగా నింద నెత్తిన వేసుకున్నారు. బ్రతికినంతకాలం నేనీమచ్చ భరించలేను. ఇంత జరిగినతరువాత నేను మీతోకలసి జీవించలేను. నాదారిన నన్ను పోనివ్వండి." కన్నీటితో రెండుచేతులు జోడించింది వందన.

అంత దుఃఖంలోను-జీవం లేనిదైనా-నవ్వాడు మౌళి. వందన చేతిని తనచేతిలోకి తీసుకున్నాడు. "ఇప్పుడు నువ్వు వెళ్ళిపోతేమాత్రం పోయిన నాన్న తిరిగొస్తారా వందనా! కళ్ళముందులేనంత మాత్రంచేత అనుకునేవాళ్లు అనుకోవటం మానేస్తారా? ఆవేశంలో ఆలోచనారహితంగా ప్రాణం తీసుకున్నారు నాన్న. ఏమిటి మనం చేసిన తప్పు? నీ తండ్రి మోసంతో ప్రవర్తిస్తే అది నీతప్పా? ఏ తప్పూ చెయ్యని భార్యని వదిలెయ్యమన్న తండ్రి మాటని పాటించకపోవటం నాతప్పా? ఎందుకు మనకీ శిక్ష? ★